తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## తానూ విజ్ఞానపీఠం విద్యార్థినే

### -అహోబిలం మఠాధిపతి యతీంద్రమహాదేశికన్





తిరుమల, మార్చి 23ప్రభాతవార్తప్రతినిధి:

టిటిడి వేదవిజ్ఞానపీఠంలో తానుకూడా వేద విద్యఅభ్యసించానని, తానూ పూర్వవిద్యార్థినే అని అహోబిల మఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్ గుర్తుచేసుకున్నారు. ధర్మగిరి వేదవిజ్ఞానపీఠాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఇక్కడ వేదవిద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అనుగ్రహభాషణం చేశారు. ఈ కార్యక్రమంలో వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రమణ్య అవధాని, టిటిడి ఆగమసలహాదారుడు మోహనరంగాచార్యులు, వేద, ఆగమపండితులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ జాతరకి

# విస్తృత ఏర్పాట్లు

- జాతరలో మద్యం విక్రయస్తే కఠిన చర్యలు
- అధికారులు ఉత్సవ కమిటీ సమన్వయంతో విజయవంతం చేయాలి
- జేసి రాఘవేంద్ర మీనా, ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



చిల్లకూరు, మార్చి 23, ప్రభాతవార్త

ఈనెల 25 నుండి 28వ తేదీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆదివారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మేనన్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాశం కుమార్, డి.ఎస్.పి గీత కుమారితో కలిసి అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఎంతో ప్రాముఖ్యమైందని ఆంధ్ర తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేస్తూ ముందుకు వెళ్తున్నారని వారు తెలిపారు. అదే విధంగా ఇటీవల తిరుపతిలో జరిగిన తొక్కసులాట కి సంబంధించి పరిస్థితులు ఎక్కడ కూడా పునరావతం కాకూడదన్న ముఖ్య ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఇక్కడ జరుగు ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో ఎలాంటి అవాంఛన్ సంఘటనలు జరగకూడదని అధికారులకు సూచించారు అదేవిధంగా జాతర జరుగు మూడు రోజులు పరిసర ప్రాంతాల్లో మద్యం, డైమండ్ డబ్బా, పేకాట ఎట్టి పరిస్థితుల్లో ఈ పరిసరాల్లో ఉండకూడదని అధికారులకు గట్టిగా హెచ్చరించారు. ముత్యాలమ్మ అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగ కూడా తొందరలో ప్రవేశపెట్టడం జరుగుతుందని తెలిపారు. జాతరకి సర్వం సిద్ధం చేసినట్లు అధికారులు వారి వారి శాఖల వారీగా ఏర్పాట్లను ఎమ్మెల్యేకి సబ్ కలెక్టర్‌కి తెలియపంచడం జరిగింది. నిరంతరాయం విద్యుత్తు, త్రాగునీరు పారిశుద్ధంతో పాటు గట్టి పోలీస్ బందోబస్తు నడుమ నడుమ జాతర ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వారు తెలిపారు. ముందుగా ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ రావడంతో ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మేనన్, డిఎస్పి గీతా కుమారి, అసిస్టెంట్ కమిషనర్ జే శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ బాబు, ఈవో నవీన్ కుమార్, సిఐ కిషోర్ బాబు ఎస్ఐ సురేష్ బాబు ఉత్సవ కమిటీ సభ్యులు చిల్లకూరు దశరథరామిరెడ్డి మారని సుబ్రహ్మణ్యం సారగ ్న రమేష్, పార్టీ అధ్యక్షులు పుచ్చూరు వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాలు లీలావతి, నాయకులు ఓబ్బాయి శివకుమార్, అన్న మునిశేఖర్, పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, ఎదనపర్తి భాస్కర్ రెడ్డి, తాసిల్దారులు కే శ్రీనివాసులు, డివిజన్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెట్టును ఢీకొన్న కారు

- ఇద్దరు మృతి.. ఆరుగురికి గాయాలు
- ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లో ప్రమాదం





తడ, మార్చి 23 ప్రభాతవార్త

ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లోని తడ మండలం పెరియవట్టు వద్ద ఆదివారం ఉదయం చెన్నై నుంచి ఉబ్బలమడుగుకు వెళుతున్న కారు చెట్టును ఢీకొని ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన చోటే ఒక మహిళ మృతిచెందగా, అనంతరం చికిత్స పొందుతూ మరొక మహిళ మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు, చెన్నైలోని తాంబరం నుంచి బుచ్చినాయుడుకండ్రిగ మండలం ఉబ్బలమడుగు వాటర్‌ఫాల్స్‌కు వెళుతున్న స్నేహితుల బృందం ప్రమాదంలో చిక్కుకుంది. మొత్తం అందరూ డ్రైవర్‌తో సహా స్నేహితులే ఉన్నారు. ప్రమాద సమయంలో కారును మహమ్మద్ అవాస్ నడుపుతున్నాడు. ఆంధ్రా ప్రాంతంలో ప్రవేశించిన తర్వాత పెరియవట్టు వద్ద ఈ కారును అతివేగంగా అజాగ్రత్తగా నడిపి జాతీయ రహదారి పక్కనున్న కొబ్బరిచెట్టును ఢీకొట్టినట్లు పోలీసులకు ప్రాథమిక సమాచారం అందింది. ప్రమాదం జరిగిన ప్రదేశంలోనే షబిల్ ఫాతిమా (21) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడిన డ్రైవర్‌తో సహా మిగిలిన ఆరుగురిని మొదట ఎలావూరు సమీపంలోని ఒక ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తీసుకెళ్లినట్లు తెలిసింది. అక్కడ చికిత్స పొందుతున్న డీనా (34) ఆసుపత్రిలోనే మరణించారు. మృతిచెందిన ఫాతిమా తాంబరంకు చెందిన వారు కాగా, డీనా చెన్నైలోని అమిజుకళైకి చెందిన వారు. డ్రైవర్ మహ్మద్ అవాస్ చెన్నైలోని భారతి దరన్‌నగర్‌కు చెందిన వారు కాగా, లోగేష్ శాంతిరోడ్డు నివాసి. బెంజిమెన్ నీలచ్చేరి ప్రాంతానికి చెందిన యువకుడు. ఆలియా బేగం భారతిదరన్‌కు చెందిన వారు. శ్రీమాన్ చెన్నైలోని సైదాపేట, మహేష్ తాంబరంకు చెందిన వారిగా గుర్తించారు. మొదట మృతిచెందిన మహిళను పోలీసులు సూళ్లూరపేట ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం సాయంత్రం మరో మహిళ మృతిచెందినట్లు సమాచారం అందింది. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జనసేన బలోపేతానికి కృషి

### చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహర్



చంద్రగిరి, మార్చి 23 ప్రభాతవార్త:

చారిత్రాత్మక చంద్రగిరి నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహర్ తెలిపారు. చంద్రగిరిలో ఆదివారం తిరుపతి ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు, కోడూరు ఎంఎల్‌ఏ అరవ శ్రీదర్, పార్టీ చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ చేతులమీదుగా జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో పోటీ చేసిన అన్ని స్థానాలలో విజయం సాధించి వంద శాతం ఫలితాలు సాధించిన ఏకైక పార్టీ జనసేన అన్నారు. దేవర మనోహర్ వంటి నాయకుడికి జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు సహకరించాలన్నారు. 2014లో ఒక్కరితో మొదలైన జనసేన ప్రస్థానం 2024లో యావత్ దేశానికి సారధ్యం వహిస్తున్న ఎన్‌డిఏ కూటమిని రాష్ట్రంలో సైతం అధికారంలోకి తీసుకొచ్చి ఘనత వహించిదన్నారు. అదేవిధంగా దేవర మాట్లాడుతూ ఎంఎల్‌ఏ పులివర్తి నాని సహకారంతో చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్యన వారధిగా వుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి చూపాలని డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఆదేశించినట్లు వివరించారు. అంతకుముందు చంద్రగిరిలో జనసేన కార్యకర్తలతో కలిసి టవర్ క్లాక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తూ ఓపెన్ జీప్‌లో ఊరేగుతూ నాగాలమ్మ మలుపు వరకు వెళ్ళి తిరిగి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యదర్శులు తాతంశెట్టి నాగేంద్ర, ఆకేపాటి సుభాషిణి, బిజెపి నాయకుడు పురుషోత్తం నాయుడు, టిడిపి నాయకుడు దొడ్ల కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన

# పెను ప్రమాదం

### ఎంపేడు వద్ద లారీని ఢీకొన్న కార్బన్ బస్సు



నది గుంతలో పడ్డ కార్బన్ కంపెనీ బస్సు

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని ఎంపేడు వద్ద ఆదివారం ఉదయం జరిగిన ఓ సంఘటనలో 15 గాయపడినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ నరసింహారావు వివరించారు. అయితే అడుగుల దూరంలో ఉన్న నదిలో బస్సు బొల్తాపడే ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. విమానాశ్రయానికి ఉన్న కార్బన్ లియో మొబైల్ కంపెనీకి చెందిన ట్రావెల్ బస్సు ప్రతి రోజూ కార్మికులను వెంకటగిరి పరిసరాల్లోంచి తీసుకెళ్ళటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఈ బస్సు ప్రతి రోజూ వెంకటగిరి ఏర్పేడుల మీదుగా విమానాశ్రయానికి చేరుకుంటుంది. యథాప్రకారం ఆదివారం ఉదయం డక్కిలి మండలం నుంచి బయలుదేరి 15 మందిని తీసుకొని ఏర్పేడు వైపు వస్తుండగా ఎంపేడు వద్ద ఉన్న స్వర్ణముఖి నది వద్దకు రాగా ఏర్పేడు నుంచి వెంకటగిరి వైపు వెళుతున్న లారీని అదుపు తప్పి ఢీకొన్నట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తుందన్నారు. ఈ బస్సులో పయనిస్తున్న డక్కిలి మండలం అల్తూరుపాడుకు చెందిన బస్సు డ్రైవర్ మునీంద్ర, లింగసముద్రానికి చెందిన శివాజి, రాయచోటికి చెందిన లారీడ్రైవర్ రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సులో ఉన్న గుండ్ల గుంటకు చెందిన ప్రసాద్, వెంకటగిరికి చెందిన కుశల్, రాపూరుకు చెందిన యశోదలక స్వల్ప గాయాలయ్యాయి. మిగిలిన వారికి గోకుడు గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108లో వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యాధికారి డాక్టర్ జిలాని ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన సేవల కోసం తిరుపతికి తరలించారు. మిగిలిన వారిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదంలో ఎవ్వరికి ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు.

# వేలి ముద్రల సమస్యకు చెక్ !

కోట, మార్చి 23 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం పించన్ల లబ్దిదారులకు తీపి కబురు చెప్పింది. ఇప్పటికే ఒకటో తేదీన సెలవోస్తే ముందురోజే పించన్ల పంపిణీ చేపట్టతోంది. ఏప్రిల్ నుంచి పించన్ల పంపిణీలో తాజాగా ఆధునాతన స్కానర్లను అందుబాటులోకి తెచ్చింది. ఏప్రిల్ నుంచి పింఛను పంపణీలో ఈ స్కానర్ల ద్వారా పింఛను అందించనున్నారు. కోట మండలంలో సూమారు 6 వేల మంది వివిధ రకాల లబ్దిదారులు ఉన్నారు. పింఛను తీసుకుంటున్న సమయంలో వేలిముద్రలు పడకపోవడంతో చాల మంది పింఛను ఆందుకోలేక అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా వృద్దులు, చేతి వృత్తి పనులు చేస్తున్న వారిలో ఎక్కువగా ఈ సమస్య ఉంది. వేలి ముద్రల ఆరిగి పోవడంతో స్కానర్లు సరిగా స్కాన్ చేయలేకపోతున్నాయి. ప్రస్తుతం ఎల్ 0 స్కానర్లు ద్వారా లబ్దిదారులు వేలి ముద్రలు వేస్తున్నారు. దీంతో పంపిణీలో ఆటు ఉద్యోగులు ఇటు లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం పాత స్కానర్ల స్దానంలో ఎల్ ..1 ఆధునాతన స్కానర్లు అందుబాటులోకి తీసుకు వచ్చింది, వీటి ద్వారా ఇకపై వేలి ముద్రల సమస్య తీరనుంది.

# ఘనంగా శ్రీ సిద్ధేశ్వరస్వామి పెద్ద దేవర

### తలలపై పగిలిన టెంకాయలు.. జోగ్యానూరులో కురబ కులస్తుల సందడి !!



కుప్పం, మార్చి 23 ప్రభాతవార్త

ఏడేళ్లకు ఓ సారి జరుపుకునే జాతరకు కురబ కులస్తులు పోటెత్తారు. దీంతో గుడుపల్లె మండలం జోగ్యానూరు గ్రామంలో ఆదివారం సందడి నెలకొంది. గ్రామంలో వెలసిన శ్రీ సిద్ధేశ్వరస్వామి వారికి కొన్ని గోత్రాలకు సంబంధించిన కురబ కులస్తులు ఏడేళ్లకు ఓసారి జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈనేపథ్యంలో ఆదివారం సా ్వమివారి జాతరను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయం ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలనుంచి వచ్చిన కురబ కులస్తులతో కిటకిటలాడుతూ కన్పించింది. స్వామివారిని ఈసందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం స్వామివారిని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కురబ కులస్తులకు అన్ని విధాలా సిఎం చంద్రబాబునాయుడు అండగా ఉంటారన్నారు. జాతర నిర్వహణకు సంబందించి తగు ఆదేశాలు ఇవ్వడంతో అధికార యంత్రాంగం తగు చర్యలు చేపట్టారన్నారు. రాష్ట్ర ప్రజలకు శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. కాగా శ్రీ సిద్ధేశ్వరస్వామితో పాటు శ్రీబీరేశ్వరస్వామి ఆలయాల్లోను పూజలు జరిపారు. కాగా జాతర సందర్భంగా మొక్కులు కలిగిన కురబ కులస్తులు అధిక సంఖ్యలో తమ తలలపై భకి ్త శ్రద్ధలతో టెంకాయలు పగలగొట్టుకున్నారు. ఈ కార్యక్రమం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమాల్లో సలహాదారు నరేష్‌చారి, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, రాష్ట్ర కురబ కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, తెలుగుయువత మండల అధ్యక్షుడు సుబ్బు, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, కన్నన్, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

## యూత్ హాస్టల్, డి.ఆర్.డి.ఏ కార్యాలయాలకు దారేదీ?

### ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

తిరుపతి కార్పొరేషన్, మార్చి 23 ప్రభాతవార్త

సుదూర ప్రాంతాల నుండి తిరుపతికి వచ్చే విద్యార్థులకు నీడనిస్తున్న యూత్ హాస్టల్, డి.ఆర్.డి. ఏ. కార్యాలయంలో శిక్షణ పొందేందుకు వస్తున్న వారికి దారిలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలిసినా ఎందుకో ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సుదూర ప్రాంతాల నుండి తిరుపతికి వచ్చే విద్యార్థులకు తక్కువ ధరలకు గదులు ఇచ్చేలా, సమావేశాలు జరుపుకునేందుకు ప్రభుత్వం యూత్ హాస్టల్‌ను ఏర్పాటు చేసింది. ఎంతో ఉన్నత స్థాయికి వెళ్ళిన అధికారులు సైతం ఇక్కడ ఉండే పరీక్షలు వ్రాసి ఉత్తీర్ణులై ఉన్నత స్థానాల్లో ఉన్నారు. పలు సామాజిక సంఘాలు, ఎన్.జి.ఓ.లు ఇక్కడే సమావేశాలు జరుపుకునేవారు. ఈ యూత్ హాస్టల్ కి కొమల్ రెడ్డి కూడలి నుండి పోలీస్ పెరేడ్ గ్రౌండ్ పక్కన ఉన్న దారిలో వెళ్ళేవారు. అయితే పోలీసు వారు ఈ దారిని మూసి వేస్తూ గోడను నిర్మించారు. దీంతో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం పక్కనుండి యూత్ హాస్టల్, డి.ఆర్.డి.ఏ. కార్యాలయాలకు రాకపోకలు సాగించేవారు. ఈ దారిని సి సి రోడ్డుగా కూడా మార్చారు. అయితే ఓ అధికారి తహసీల్దార్ కార్యాలయంలో దేవుడి గుడి నిర్మించారు. గుడి పేరుతో పక్కనే ఉన్న కొంత స్థలంలో స్వామి వారి ఉత్సవాలు సరంజామా ఉంచుకునేందుకు గది ఏర్పాటు చేసుకున్నారు. స్వామి వారి ఉత్సవాలు పేరుతో అప్పుడప్పుడు యూత్ హాస్టల్, డి.ఆర్.డి.ఏ. కార్యాలయాలకు వెళ్ళే దారిని మూసేస్తూ వచ్చారు. ఇప్పుడు వాహనాలు, మనుషులు రాకుండా ఏకంగా రాస్ బిల్డింగ్ పక్క నుండే దారి మళ్ళించేశారు. దీంతో యూత్ హాస్టల్, డి.ఆర్.డి.ఏ. కార్యాలయాలకు వెళ్ళే దారే లేకుండా పోయింది. ముఖ్యంగా యూత్ హాస్టల్ కి ప్రతిరోజూ కొత్తవారు వస్తుంటారు, వారు దారి తెలియక తికమక పడుతున్నారు. ఈ విషయం పలువురు అధికారులకు తెలిసినా ఆ అధికారితో మనకెందుకులే అన్నట్టు ఉంటున్నారు.

# వేసవిలో విద్యుత్ కొరత లేకుండా చర్యలు

- కుప్పం నియోజకవర్గంలో కొత్తగా 5 సబ్‌స్టేషన్లు ఏర్పాటు
- ట్రాన్స్‌కో ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్



చిత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:

వేసవి కాలంలో రైతులు, ప్రజలు, పరిశ్రమలకు ఎలాంటి విద్యుత్ కొరత ఉత్పన్నం కాకుండా పక్కాగా చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో సూపరిటెండెంట్ ఇంజనీర్ ఇస్మాయిల్ అహ్మద్ పేర్కొన్నారు. వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా తాము తీసుకుంటున్న చర్యలపై ఆదివారం ట్రాన్స్‌కో ఎస్ఇ ఇస్మాయిల్ అహ్మద్ 'ప్రభాతవార్త'కు వివరించారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా రోజుకు 1,200 మెగా వాట్లు లేదా 10.6 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం జరుగుతున్నదన్నారు. వేసవి కాలంలో ఈ వినియోగం మరింత పెరిగే అవకాశం వుందని దానికి తాము సిద్దంగా వున్నామన్నారు. చిత్తూరు జిల్లాలో ప్రత్యేక పరిస్థితులు వుంటాయని ఒక ప్రాంతంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైతే అదే సమయంలో మరొక ప్రదేశంలో చల్లగా వుండే అవకాశం వుంటుందన్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలు వున్న ప్రాంతాల్లో చల్లదనం కోసం ఎయిర్ కండీషన్లు ఎక్కువగా వాడకం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై ఒత్తిడి పెరిగి పేలిపోయే పరిస్థితులు వుంటాయన్నారు. విద్యుత్ వినియోగం అధికం అయిన సమయంలో ట్రాన్స్‌కో అధికారులే లోడ్ రిలీఫ్ కింద విద్యుత్ సరఫరాను ఒక గంట వరకు నిలుదల చేసే అవకాశం వుంటుందన్నారు. ఏప్రిల్, మే నెలల్లో రోజుకు 12 నుండి 12.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం వుండే అవకాశం వుందని, ఈ మేరకు విద్యుత్ సరఫరా చేయడానికి తాము సిద్ధంగా వున్నామన్నారు. ప్రస్తుతం సౌర విద్యుత్ సైతం అందుబాటులో వుండటంతో వేసవి కాలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఎక్కడా వుండదని ఆయన తెలిపారు. జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా వుంటుందని, వ్యవసాయ విద్యుత్‌ను సైతం నిర్ధేశించిన సమయాల్లో పక్కాగా ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో సైతం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా ప్రయత్నిస్తామన్నారు. అలాగే కొంతమంది వినియోగదారులు తక్కువ మొత్తం లోడ్‌కు రుసుం చెల్లించి అదనంగా లోడ్‌ను వినియోగించి శాఖకు నష్టం కల్గిస్తున్నారన్నారు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం ఒక అవకాశం కల్పించిందని, వినియోగదారులు తాము వినియోగిస్తున్న అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవడానికి తాము చెల్లించాల్సిన మొత్తంలో 50 శాతం రాయితీ కల్పించడం జరిగిందన్నారు. కుప్పం నియోజకవర్గంలో ఆరు కొత్త సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని వీటిని త్వరలో ప్రారంభించనున్నామన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో కొత్తగా రెండు, మూడు సబ్ స్టేషన్ల నిర్మించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపడం జరిగిందన్నారు. అలాగే లోఓల్టేజ్ సమస్యలను పరిష్కరించడానికి ఎక్కడ అవసరం అయితే అక్కడ అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయడానికి సిద్దంగా వున్నామన్నారు. జిల్లాలో ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా వుండటానికి 33 కెవి ఇంటర్ లింకింగ్ లైను కార్యక్రమంను విస్తృతంగా చేస్తున్నామన్నారు. 33 కెవి ఇంటర్ లింకింగ్ లైను కార్యక్రమం ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పూర్తి కాగా మరికొన్ని ప్రాంతాల్లో జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమం పూర్తయితే జిల్లాలో ఎక్కడ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినా పది నిముషాల్లో మళ్ళీ విద్యుత్ సరఫరాను పునరుద్దరించడానికి అవకాశం వుంటుందన్నారు.

# తిరుపతి డివిజన్

## ఐదేళ్ళుగా పట్టించుకోలేదు: ఒక్క అర్జీతో పరిష్కారం

దాహార్తి తీర్చిన నాయకుడు

శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పరిపాలన ప్రజా సమస్యల పరిష్కార దిశగా అడుగులేస్తుంది. ఈ నేపధ్యంలో ఈదుల గుంట కాలనీలో గత ఐదేళ్ళుగా ఎన్నో సార్లు అధికారులకు మొరబెట్టుకున్నా పట్టించుకోలేదు. పాలకుల దృష్టికి తెస్తే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసారు. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డికి ఒక్క అర్జీతో మంచినీటి బోరు సమస్య పరిష్కారమైందని ఈదుల గుంట ప్రజలు వివరించారు. ఈ కాలనీలో చేతి పంపు ఐదేళ్ళ క్రితం మరమ్మత్తులకు గురైనట్లు వివరించారు. ఈ కాలనీలో స్థలాలను ఆక్రమించుకొనుటకు కాలనీని ఖాళీ చేయించుటకు ప్రయత్నించారు. దాంతో కాలనీలోని బోరు పూర్తిగా చెడిపోయింది. ఈ కాలనీకి చెందిన అమ్ములు అనే తెలుగుదేశం కార్యకర్త అమ్ములు విజయ్, కుమార్‌నాయుడులు కలసి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. దాంతో వేసవిని దృష్టిలో ఉంచుకొని నిరుపేదల దాహాన్ని తతీర్చుటకు అధికారులను ఆదేశించారు. సమస్య ఎంఎల్‌ఏ దృష్టికి వచ్చిన రెండు రోజుల్లో బోరును మరమ్మత్తులు చేసారు. దాహార్తిని తీర్చిన ఎంఎల్‌ఏకు కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

## వాకర్లతో పట్టణ సిఐ మిలాఖత్

శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని పానగల్‌లో గల ఎన్‌టిఆర్ పార్కులో పట్టణ సిఐ డిగోపి వారి సిబ్బంది ఆదివారం ఉదయం వాకర్లు, ఏరియా డామినేషన్ కోసం వచ్చిన వారితో మిలాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా సిఐ వారితో మాట్లాడుతూ నేడు పోలీసుశాఖకు ప్రజలే సామాచారం అందించే మార్గాలుగా ఉన్నారన్నారు. శ్రీకాళహస్తికి సంబందించిన ఒకే ఒక్క పార్కు ఇది. ఇక్కడకు నిత్యం వేలాది మంది ఆహ్లాదం కోసం వస్తుంటారని ఇక్కడ పరిపాలన ప్రజల మనోభావాలను గుర్తించాలని కోరారు. అలాగే ఇక్కడ ఏదైనా ఆసాంఘీక కార్యక్రమాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అంతేకాక ప్రజలు పోలీసుల నుంచి ఎలాంటి సహాయ సహకారాలు కోరుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు.

## దేశం పార్టీ వాచ్‌మెర్ కుటుంబానికి ఎంఎల్‌ఏ సహాయం

శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని ముత్తారాశి పాళెంకు చెందిన సాయి చంద్రయ్య ఎంతో కాలంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వాచ్‌మెన్‌గా పని చేస్తూ కాలం గడిపారు. పార్టీకి అత్యంత విశ్వాసంగా పార్టీ కార్యాలయంలో బాధ్యతా యుతంగా వ్యవహరిస్తూ అందరి మన్ననలను అందుకున్న చంద్రయ్య అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందారు. వారి కుటుంబానికి సానుభూతితి ప్రకటించిన శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి చరవాణిలో కుటుంబాన్ని ఆదుకొనుటకు తానున్నానని భరోసా ఇచ్చారు. ఆ కుటుంబాన్ని ఆదుకొనుటకు ఎంఎల్‌ఏ రూ.10వేలు అందించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతానికి చెందిన రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి దశరధాచ్చారి క్లస్టర్ ఇన్‌చార్జి మాజీ వైస్ చైర్మెన్ మిన్నల్ రవి, యూనిట్ ఇన్‌చార్జి ఎం.సుబ్బయ్య, బిసి నాయకులు పేట బాలాజిరెడ్డి, ప్రతాప్, మునిరత్నం, గోపాల్ మహిళా నాయకురాలు దుర్గమ్మ, సాయి శివారెడ్డి తదితరులు హాజరై తమ సంతాపాలను తెలిపారు.

## 21 వ వార్డు వినాయక ఆలయానికి విద్యుత్ సామగ్రి వితరణ

శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని 21వ వార్డులో నూతనంగా నిర్మించిన వినాయక ఆలయానికి విద్యుత్ సామగ్రిని వితరణగా అందించారు. ఆదివారం శ్రీకాళహస్తిలోని మంచినీళ్ళ గుంట సమీపంలో నూతనంగా వినాయక ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయానికి విద్యుత్ సదుపాయం కోసం టూటౌన్ సిఐ వెంకటేశ్వర్లును అభ్యర్థించారు. ధార్మిక భావవాలు కల్గిన ఆయన వెంటనే ఉసిరిపాటి శ్రీనివాసులు చేతుల మీదుగా ఆలయ కమిటి సభ్యులకు విద్యుత్ సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి నియోజకవర్గంలోని ప్రముఖులు పారిశ్రామిక వేత్తలు తమ వంతు సహాయ సహకారాలనను అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఆలయ కమిటి సభ్యులు రాజా, బాల, ప్రజాసంఘాల నాయకులు రోడ్ల గోపి, న ఆగరాజు, బిఎస్‌ఎన్‌ఎల్ కళ్యాణ్, బాబు, మహేష్, మునిరాజా, గురు, సాత్విక్ తదితరులుపాల్గొన్నారు.

## 28న ఇఫ్తార్ విందు

శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంటక సుధీర్‌రెడ్డి ఈ నెల 28 శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసారు. ఈ మేరకు ఆయా మసీదుల నిర్వాహకులకు సమాచారం అందింది. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మొదటి దశలో ఈదుల గుంట ఈద్‌గాహ్‌ను అలాగే అక్కడ ఉన్న ఉర్దుఘర్ కం షాదీమహల్‌నుసుందరీకరించారు. సుమారు రూ.50లక్షలు వెచ్చించి పనులు చేపట్టారు. ఇక్కడే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు సమాచారం. శ్రీకాళహస్తిలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చే మత సామరస్య విధానాలకు ప్రస్తుత ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శ్రీకారం చుట్టరు.

## టేప్ నూతన కమిటి ఎంపిక

తిరుపతి హెల్త్, మార్చి 23 ప్రభాతవార్త ః



ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ (టేప్) నూతన కమిటిని ఎంపిక చేశారు. ఈ మేరకు ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఈ నూతన కమిటిని ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఛైర్మన్ టి. వెంకటష్‌బాబు, అధ్యక్షుడిగా ఎం. ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పి. నాగేశ్వర రావు, ఎ. సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా బి. షణ్ముగం, కోశాధికారిగా సందేష్, సహాయ కార్యదర్శులుగా శివశంకర్‌రెడ్డి, బంగారయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నరేష్, వెల్ఫేర్ కార్యదర్శిగా సురేష్‌బాబుతో పాటు 9 మంది కమిటి సభ్యులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా జూలై 12,13వ తేదీల్లో పీఎల్‌ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించనునన టేప్ ఎక్స్పో-2025 బ్రోచర్స్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సహాయ కార్యదర్శి జయప్రకాష్, నాగ శ్రీనివాస్, మదన్ గోపాల్ పాల్గొన్నారు.

## హెల్పింగ్‌హ్యాండ్ సేవలు అనిర్వచనీయం..డిఎస్పీ

తొట్టంబేడు, మార్చి 23 ప్రభాతవార్త



రంజాన్, ఉగాది పండుగను పురస్కరించుకుని శ్రీకాళహస్తి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా పేదలకు వస్త్రాలు మరియు నిత్యావసర సరుకులను పండుగ నిర్వహించుకునేందుకు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా డిఎస్పీ నరసింహమూర్తి, అర్బన్ సిఐ డి.గోపిలు లు విచ్చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు మునీర్‌బాషా అధ్యక్షత వహించగా డిఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ మునీర్‌బాషా సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరు సేవా భావాలను అలవరచుకోవాలని పేదలకు తమ వంతు సాయం చేయాలని కోరారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులకు, నిరుపేదలకు వస్త్రాలు, నిత్యావసర సరుకులు పంపిణీచేశారు. కార్యక్రమంలో న్యాయవాది రాజేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు కోళ్ళూరుహరనాథ్‌నాయుడు, బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జాతీయ సదస్సు



***తిరుపతి, మార్చి23(ప్రభాతవార్త:*** పద్మావతి మహిళా వర్సిటీ ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో రీసెంట్ డిసిప్లినరీ ట్రెండ్స్ ఇన్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ అంశంపై రెండు రోజులజాతీయ సదస్సు సావేరి సమావేశ మందిరంలో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆప్సీ వైస్ ఛైర్మన్ ఉమా మహేశ్వరీదేవి పాల్గొని మాట్లాడారు. వైజ్ఞానిక ,మానవీయ శాస్త్రాల అనుసంధానం ద్వారా సమాజం స్ఫూర్తి పొందే ఆవిష్కరణలు చేయాలని కోరారు. అనంతరం వర్సిటీ రిజిస్ట్రార్ రజని కృత్రిమ మేధ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డీన్ ఆచార్య సుధ, సెమినార్ కన్వీనర్ ఆచార్య వైఎస్ శారద, కో కన్వీనర్ ఆచార్య నిర్మల, సిబ్బంది, పరిశోధక విద్యార్థినులు పాల్గొన్నారు.

## నేడు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం పై అవగాహన

***తిరుపతి విద్య మార్చి 23 ప్రభాత వార్త*** ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ కల్చరల్ అఫైర్స్, సెట్విన్ కోఆర్డినేటర్స్ డాక్టర్ పత్తిపాటి వివేక్, మోహన్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఖీవ్యక్తిత్వ వికాసంఖీఅనే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎస్వీయూలోనూ, పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల నందు రెండు వేదికలపై జరగున్న ఈ కార్యక్రమానికి ప్రముఖ సైకాలజిస్టు, వర్సిటీ వీసీలు, శ్యాప్ చైర్మన్ హాజరుకానున్నారు.

## తెలుగు అంటే ఆప్షనల్ కాదు ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం.

తిరుపతి విద్య, మార్చి 23 ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎం బైపీసీ విధానంలో ద్వితీయ భాషగా తెలుగును ఇప్పుడున్న విధంగా కాకుండా ఐచ్చికంగా తీసుకురావడం ఎంతో శోచనీయమని తిరుపతి జిల్లా తెలుగు ఉపాధ్యాయ సంఘం వారు ఇంటర్మీడియట్ స్పాట్ వ్యాల్యూషన్ కేంద్రం ఎస్ వి జూనియర్ కళాశాలలో ఆర్ ఐ ఓ ప్రభాకర్ రెడ్డికి వినతి పత్రం అందించి నిరసన తెలియజేశారు. ఆర్ఐఓ స్పందిస్తూ ఇంటర్మీడియట్ కమిషనర్ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యాసంస్కరణలలో భాగంగా ఇప్పటివరకు ద్వితీయ భాషగా తప్పనిసరిగా ఉన్న తెలుగు భాషను ఐచ్చిక సబ్జెక్టుగా మార్పు చేయడం చేయడం వలన భవిష్యత్తులో తెలుగు ప్రశ్నార్థకమవుతుందన్నారు. ఉన్నత విద్యలో తెలుగు భాష ప్రాధాన్యాన్ని తగ్గించడం తొందరపాటు చర్య అని ఈ విధమైన నిర్ణయం తెలుగు ప్రజలందరి ఆత్మగౌరవం దెబ్బతింటుందని, పొరుగు రాష్ట్రాలు కర్ణాటక తమిళనాడు వారి మాతృభాషలకు పెద్దపీట వేస్తుంటే ఇక్కడ ఎందుకు సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డా. నాదెండ్ల శ్రీమన్నారాయణ, డా.దుర్గారావు, మీరా సాహెబ్, మునీంద్ర, గంగాధర్, డా.జయమ్మ, వెంకట్రావు, శిరీష, రమా, ఉమాదేవి, మోహన్, శశికళ, నాగేశ్వరరావు, వాణి, డా.ధనమ్మ, డా వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సినీ నటుడు సుమన్‌ను కలిసిన పర్చూరు నారాయణ గౌడ్.

తిరుపతి విద్య మార్చి 23 ప్రభాత వార్త



కలియుగ వైకుంఠ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి ప్రముఖ సినీ నటుడు డాక్టర్ సుమన్ ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఎపి బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గౌడ్ మాట్లాడుతూ సినిమాలలో శ్రీరామదాసు, సత్యనారాయణ వ్రతం, అయ్యప్ప కటాక్షం, అన్నమయ్య వంటి సినిమాలలో శ్రీ వేంకటేశ్వర స్వామి పాత్రలో అద్భుతంగా నటించి తెలుగు ప్రజల మెప్పు పొందారు. ఆ పాత్రలో ఆయన నటించినప్పటి నుంచి ప్రతి సారి స్వామి వారి దర్శనానికి వస్తున్నారని చెప్పారు. ఆయనకు ఇంకా మంచి పాత్రల్లో నటించే అవకాశం రావాలని కోరుకున్నారు.

## వ్యాపారులు పన్ను చెల్లింపులో జాగ్రత్తలు తీసుకోవాలి

– ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఫాల్గుణ కుమార్

తిరుపతి హెల్త్, మార్చి 23 ప్రభాతవార్త ః




కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బడ్జెట్‌తో పాటు జీఎస్టీ చట్టాలపై అవగాహన చేసుకుని పన్నులు చెల్లించాల్సి ఉంటుందని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఫాల్గుణ కుమార్ తెలిపారు. ఆదివారం ఓ ప్రైవేట్ హోటల్‌లో కేంద్ర బడ్జెట్‌లో వచ్చిన చట్టాలతో పాటు జీఎస్టీ చట్టాలపై ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా చాంబర్ కామర్స్ ఆధ్వర్యంలో 2025-26 కేంద్ర బడ్జెట్ నూతన చట్టాలు, జీఎస్టీ చట్టాలపై వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు తిరుపతి జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షులు కె.వి చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సమావేశంలో ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఫాల్గుణకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు తీసుకుని వచ్చిన చట్టాలను వ్యాపారులు ముందుగా అవగాహన చేసుకుని ప్రభుత్వానిక ఏవిధంగా పన్నులు చెల్లించాలో తెలుసుకోవాల్సిన విషయాలను గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కె.వి చౌదరి, కార్యదర్శి కె. రఘురామిరెడ్డి, ట్రెజరర్ ప్రసాదరావు, వైస్ ప్రెసిడెంట్ టి. సుబ్బరామ గుప్తా, కె. రాజేంద్రన్, జాయింట్ సెక్రటరీ ఎం. వెంకటేశ్వర్లు, ఏ.బాలాజీ సభ్యులు పి. చంద్రశేఖర్, ఏ. సురేష్, తిరుపతి జిల్లాలోని నలు మూలల నుంచి వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## పుత్తూరు బీజేపీ నాయకులకు ఘన సత్కారం

పుత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:




జైపూర్ మహల్ రాజవాడ రిసార్ట్‌లో జరిగిన సమావేశంలో పుత్తూరు ఆంధ్రప్రదేశ్ మహిళా అధ్యక్షులు నిషిధరాజు, ఏపీ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రాజు, సెక్రటరీ కోనేటి రవిరాజు, ఏపీ యూత్ ప్రెసిడెంట్ బాల సుబ్రహ్మణ్యంరాజులను మినిస్టర్ అఫ్ అగ్రికల్చర్, క్షత్రియ సభ ప్రెసిడెంట్ దినేష్ ప్రతాప్ సింగ్, సెక్రటరీ జనరల్ హరీంద్ర పాల్ రానాలు ఘనంగా సత్కరించారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రెసిడెంట్‌లు, సెక్రటరీలు పాల్గొన్నారు. రాజపుత్ర క్షత్రియులు, రాజులు, వర్మాలు అందరూ ఒకటిగా ఉంటూ అన్ని విధాలుగా రాజకీయం ఏ సమస్యలు అయినా మనం పరిష్కారం చేసుకోవాలన్నారు. వీరికి పదువులు ఇచ్చి వీరిని ఘనంగా సత్కరించారు.

## మీ అందరి సహకారంతో అత్యధిక మెజారిటీతో గెలిచా - ఎమ్మెల్యే

పుత్తూరు, మార్చి 23 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని గేటు పుత్తూరులో ముస్లిం మైనారిటీల నాయకులు మసీద్ భాయ్ ఇంటికి ఆదివారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ విచ్చేసి పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అలాగే టీడీపీ ఎప్పుడు ముస్లింలకు అండగా ఉంటూ వాళ్ళ సంక్షేమం, అభివృద్ధి కోసం ఉంటుందని గుర్తు చేశారు. ముస్లిం సోదర సోదరీమణులకు అన్ని మౌలిక వసతులు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. ఏ సమస్య అయినఆ సరే తన దృష్టికి తీసకొస్తే పరిష్కార మార్గం చూపుతానని భరోసా కల్పించారు. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. టీడీపీ ముస్లిం నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## వ్యాసాశ్రమానికి పూర్వ వైభవం తీసుకురావాలి!

పూర్వ విద్యార్థుల సమావేశం

శ్రీకాళహస్తి, రూరల్ మార్చి 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలో వెలసిన వ్యాసాశ్రమానికి పూర్వ వైభవం తీసుకురావటానికి ప్రతి ఒక్కరు సహకరించాలని పూర్వ విద్యార్థుల సమావేశంలో సీనియర్లు అభిప్రాయపడ్డారు. 1962 నుంచి ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఇక్కడి ఆశ్రమం మళయాళ సద్గురు సారథ్యంలో ఏర్పాటు చేసి ఎన్నో సమాజిక కార్యక్రమాలను చేపట్టారన్నారు. మహిళలకు సంస్కృత విద్యను అందించుటకు మళ యాళ సద్గురు కృషి చేసారన్నారు. అంతేకాక ఆధ్యాత్మిక రంగంలో తన వంతు కృషి చేసిన మళయాళ సద్గురు ప్రపంచ దేశాల్లో ఆశ్రమం ప్రాధాన్యతను చాటారన్నారు. ఆహ్లాదకరవాతావరణంలో నిర్వహిస్తున్న వ్యాసాశ్రమం అంటే నేటికి ప్రపంచ దేశాల్లో గుర్తింపు ఉందన్నారు. ఓ వైపు మహిళా విద్యమరో వైపు ఆశ్రమ విద్యతో పాటు సామాజిక విద్యను అందించటలో కూడా ఆశ్రమం వ్యవస్థాపకులు ఎంతో కృషి చేసారన్నారు. మాజీ ఎంఎల్‌సి వితపు బాల సుబ్రమణనయం అధ్యక్షతన జరిగిన సమావేశంలో అశ్రమ అభివృద్ధికి ప్రత్యేక కమిటిని ఏర్పాటు చేసారు.

**అభివృద్ధి కమిటి ఇదే . . .** ఆధ్యాత్మిక రంగంలో తమకంటూ ఓ ప్రత్యక స్థానాన్ని సాధించిన వ్యాసాశ్రమంలో పూర్వ వైభవానికి ప్రత్యేక కమిటిని ఎన్నుకున్నారు. కమిటి అధ్యక్షుడు రమణారెడ్డి, గౌరవాధ్యక్షులుగా వితపు బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శిగా బలరామరాజు, సలహాదారుగా టి.చెంగయ్య, సంఘ కమిటి సభ్యులు 65 మంది సభ్యులుగా నియమించుకున్నారు. ఈ సమావేశంలో 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలుర పాఠశాలను పున: ప్రారంభించాలని అలాగే మలయాళ స్వామి కాంస్య విగ్రహాన్ని ఏర్పేడు కూడలిలో ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కన్యా గురుకులంలో గీత వైభవాన్ని తీసుకురావాలని మేనేజర్ కార్యాలయాన్ని మూసివేసి మగవారి ప్రవేశం ను నిషేధించాలని తీర్మానించారు. పీఠాధిపతిపరిపూర్ణానంద స్వామికి సత్కరించి వినతి పత్రాన్ని అందించారు.

## బలిజసేన అధ్యక్షునిగా వెంకటేష్

తొట్టంబేడు, మార్చి 23 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గ బలిజ సంఘ అధ్యక్షులుగా కుప్పాలవెంకటేష్‌ను నియమించినట్లు బలిజసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాటు కృష్ణ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా బలిజసేన శ్రీకాళహస్తి అధ్యక్షులు కుప్పాలవెంకటేష్ మాట్లాడుతూప బలిజల అభివృద్ధి, ఆశయ సాధన కోసం తాను అహర్నిశలు కృషి చేస్తానని మరియు తనకు ఈపదవిని అందించిన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాటు కృష్ణ ప్రసాద్‌కు ధన్యవాదాలుతెలిపారు. అనంతరం వెంకటేష్‌ను పలువురు అభినందించారు.

### పెద్ద మసీదు యువతచే ఇఫ్తార్

శ్రీకాళహస్తి, మార్చి 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని జామియామసీదులో ఆదివారం ఈ ప్రాంతానికి చెందిన యువత ఇఫ్తార్ విందును ఏర్పాటుచేసారు. ఈ మేరకు సాయంత్రం భక్తి శ్రద్ధలతో ఉపవాసదీక్షలను విరమించే సమయంలో సామూహికంగా కూర్చొని ప్రార్థనలు జరిపారు. అలాగే మసీదుకు వచ్చిన 500మందికి ఇఫ్తార్ ప్యాకెట్లను అందించారు. ఈ ప్రాంతానికి చెందిన గోరా సారథ్యంలో ఇఫ్తార్ విందును నిర్వహించారు.

## 'కార్డన్-సేర్చ్' ఆఫరేషన్‌లో తిరుపతిరూరల్ పోలీసులు

తిరుపతిరూరల్, మార్చి23 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు తిరుపతిరూరల్ మల్లంగుంట పంచాయతీ పరిధిలోని వెంకటాద్రి అపార్టుమెంట్‌లో తిరుపతి రూరల్ పోలీసులు ఆదివారం ఉదయం 5గంటలకు 'కార్డన్-సేర్చ్' ఆఫరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీలో అనుమానిత వ్యక్తులు, అనుమానిత వాహనాలు, అనుమానాస్పద వస్తువులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని అక్రమ కార్యకలాపాలు, నేరచరిత్ర ఉన్న వ్యక్తుల సమాచారం, చట్టవిరుద్ధమైన సామాగ్రి వంటి అంశాలను పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల గుర్తించి, వివరాలను ఆరా తీసారు. అలాగే అనుమానాస్పద వాహనాలను పరిశీలించి రికార్డులు ధృవీకరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ సి.ఐ చిన్న గోవిందు, ఎస్.ఐ.లు రామకృష్ణ, షేక్ షావలి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పాతూరులో దర్జాగా కాల్వల్లో అక్రమ నిర్మాణాలు

– తెలిసీ పట్టించుకోని రెవెన్యూ అధికారులు

తిరుపతిరూరల్, మార్చి 23 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం భూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. పాతూరు గ్రామంలో దాదాపు రెండు ఎకరాలు ఉన్న కాల్వపోరంబోకు స్థలంలో దర్జాగా అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రెవెన్యూ అధికారులకు తెలిసీ కూడా పట్టించుకోవడంలేదనే ఆరోఫణలు వినిపిస్తున్నాయి. యదేచ్ఛగా కాల్వపోరంబోకు ఆక్రమణకు గురైతున్నా... రెవెన్యూ యంత్రాంగం ఎందుకు అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రెవెన్యూ అధికారులు స్పందించి కాల్వపోరంబోకు స్థలం ఆక్రమణకు అడ్డుకట్టవేయాలని స్థానికులు కోరుతున్నారు.

## శ్రీ శ్రీనివాస క్రీడ సముదాయంలో ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలి

– శాప్ ఛైర్మన్ రవినాయుడు



***తిరుపతి క్రీడ, మార్చి 23, ప్రభాతవార్త*** శ్రీశ్రీనివాస క్రీడాసముదాయంలో జరుగుతున్న ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని, నిర్దిష్ట సమయంలోపు పూర్తిచేసి క్రీడాకారులకు వినియోగంలోకి తీసుకురావాలని డీఎస్ఏ అధికారులను, శాప్ ఇంజినీరింగ్ అధికారులను శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో జరుగుతున్న ఆధునీకరణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. తొలుత శాప్ నిధులు రూ.24లక్షలతో స్విమ్మింగ్ పూల్ వద్ద చేపడుతున్న పనులను పర్యవేక్షించారు. వేసవి శెలవుల దృష్ట్యా సమ్మర్ క్యాంపులు ప్రారంభించేనాటికి స్విమ్మింగ్ పూల్‌ను సిద్ధం చేయాలనన్నారు. ఫ్లడ్ లైట్లు, సింథటిక్ ఫ్లోరింగ్, మూవ్‌బుల్ బాస్కెట్‌బాల్ పోల్స్ పనులను వేగవంతం చేయాలని, లేని పక్షంలో శాప్ ఆధ్వర్యంలో చేపడుతున్న కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించాలన్నారు. మల్టీపర్పస్ హాలు నిర్మాణం పూర్తయినప్పటికీ ఏసీల ఏర్పాటు, లైటింగ్, పెయింటింగ్, తలుపులు, కిటికీల పనులు మిగిలున్నాయని, వాటిని కూడా వారంలోపే పూర్తిచేసి అప్పగిస్తామని కాంట్రాక్టర్ వివరించారు. ఈ నేపథ్యంలో రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దేవరాజ్, క్రీడాకారులు శాప్ ఛైర్మన్‌ను కలిశారు. మల్టీపర్పస్ హాలును రైఫిల్ షూటింగ్‌కు వాడుకునేలా మార్చుతామని, తమకు అనుగుణంగా రైఫిల్ షూటింగ్ రేంజ్‌ను పనులు జరుగుతున్న సమయంలోనే దగ్గరుండి చేయించుకోవాలని సూచించారు. ఆదివారం రోజునా స్పోర్ట్స్ కాంప్లెక్సును తెరిచే ఉంచాలన్నారు. ఖేల్ రత్న అవార్డు గ్రహీత ధ్యాన్‌చంద్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. పనులన్నింటినీ నాణ్యతా ప్రమాణాలతో ఏప్రిల్ 10వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్డీఓ సయ్యద్ సాహెబ్, ఏపీఈడబ్ల్యుఐడీసీ ఏఈ రాఘవ, శాప్ ఏఈ మహేష్, కాంట్రాక్టర్ లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ విద్యకు ప్రాధాన్యం

తిరుపతి హెల్త్, మార్చి 23 ప్రభాతవార్త ః



నేటి సమాజంలో నర్సింగ్ విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని తిరుపతి జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ నాయక్ తెలిపారు. తిరుపతి మల్లంగుంటలోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో ఆదివారం లాంప్ లైటింగ్ సెరమని-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ రంగంలో నర్సింగ్ అనేది ఒక ముఖ్యమైన విభాగమని వివరించారు. రోగుల వ్యాధి నివారణ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మానసిక ధైర్యాన్ని పెంపొందించడం కోసం నర్సింగ్ విద్యార్థులు కృషి చేయాలన్నారు. నర్సింగ్ విద్యార్థులు ఫ్లోరెన్స్ నైటింగేల్, మథర్ థెరిస్సా సేవలను ఆదర్శంగా తీసుకుని సమాజంలోని పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. నేటి సమాజంలో నర్సింగ్ పూర్తయిన విద్యార్థులకు దేశ, విదేశాలలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు బోధనా కళాశాలల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలియజేశారు. కాగా ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి 20వ తేది వరకు విద్యార్థులకు నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ చేతులు మీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. డెప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రగిరి మురళీకృష్ణ, వికాస్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కూనపల్లే లావణ్య కుమారి, పరిపాలనాధికారి తోట భార్గవి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సత్యవేడు మండలంలో 21 కేంద్రాల్లో ఉల్లాస్ పరీక్షలు

సత్యవేడు, మార్చి 23 ప్రభాతవార్త:



సత్యవేడు మండలంలో 21 కేంద్రాల్లో ఆదివారం ఉల్లాస్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 11 వరకు జరిగిన ఉల్లాస్ పరీక్షలకు 444 మంది అభ్యాసకులు హాజరై పరీక్షలను రాశారు. వలంటీరు టీచర్స్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్స్ పర్యవేక్షణలో పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా సత్యవేడు పట్టణం ఎస్టీ కాలనీ సంబంధించి బీసీ బాలుర వసతి గృహ ప్రాంగణంలో వలంటీరు టీచర్ సుగుణ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచరు కుమారి పర్యవేక్షణలో జరిగిన ఉల్లాస్ పరీక్షలకు పది మంది అభ్యాసకులు హాజరై పరీక్షలను రాయడం జరిగింది. మండల గ్రామీణ అభివృద్ధి సంస్థ(వెలుగు) ఏపీఎం డాంగే యాదవ్ పర్యవేక్షణలో గత మూడు నెలలుగా 42 కేంద్రాల్లో వలంటీరు టీచర్స్ అభ్యాసకులకు అక్షరాసులను నేర్పించారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఉపాధ్యాయుడు మృతి

రామచంద్రాపురం, మార్చి 23 ప్రభాతవార్త ః



ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఉపాధ్యాయుడు మృతిచెందిన సంఘటన చిట్టత్తూరు గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని చిట్టత్తూరు గ్రామానికి చెందిన శివకేశవులు కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. శనివారం తన ద్విచక్ర వాహనంలో తన సొంత పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న నేపథ్యంలో చిట్టత్తూరు ఏఏ డబ్ల్యూ వద్ద అదుపు తప్పి బోల్తా పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృత దేహాన్ని శవ పరీక్ష నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య కుమార్తె కలదు. మృతునికి సంతాపం తెలిపిన వారిలో తోటి ఉపాధ్యాయ బృందం, టీడీపీ చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చినబాబు, పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డితో పాటు పలువురు ఉపాధ్యాయులు, కూటమి నాయకులు మృత దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

## భగత్‌సింగ్ తెగువ భావితరాలకు ఆదర్శం

తొట్టంబేడు, మార్చి 23 ప్రభాతవార్త



భారత స్వాతంత్ర్య సమరంలో భగత్ సింగ్ చూపిన తెగువ భావితరాలకు ఆదర్శమని సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి కొనియాడారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్యభవన్‌లో భగత్ సింగ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భగత్ సింగ్ అమర్‌రహే అంటూ నినాదాలు ఇచ్చారు. భారత స్వాతంత్రం కోసం భగత్ సింగ్‌తో పాటు సుఖదేవ్, రాజ్‌గురు ముగ్గురు నవ్వుతూ ఉరికం ఎక్కిన స్వాతంత్ర సమరయోధులని మణి కొనియాడారు. నేటి యువత ఆయన త్యాగాలను తెలుసుకుని సామాజిక బాధ్యతతో దేశభక్తితో మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో గురవయ్య, కుమార్, బాజీరావు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## దయాకర్‌రెడ్డిని కలిసిన బీజేవైఎం మనోజ్



గూడూరు, మార్చి 23 ప్రభాతవార్త: భారతీయ జనతా యువమోర్చా బీజేవైఎం గూడూరు రాష్ట్ర నాయకులు గిద్దలూరు మనోజ్ కుమార్ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డిని, బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్‌ని తిరుపతి బిజెపి పార్టీ ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారిని కలిసి పార్టీలో రాబోవు కార్యక్రమాల గురించి సంస్థాగత విషయాల గురించి మాట్లాడటం జరిగిందని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం గూడూరు నగర అధ్యక్షులు శివశంకర్, బీజేవైఎం నగర ప్రధాన కార్యదర్శి ప్రణయ్, బిజెపి తిరుపతి అసెంబ్లీ కో కన్వీనర్ నాదముని తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాస్ పథకం ద్వారా అందరికీ విద్య



బాలాయపల్లి, మార్చి 23 ప్రభాతవార్త: ఉల్లాస్ పథకం ద్వారా అందరికీ విద్యను అందించడమే లక్ష్యమని ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. ఉల్లాస్ అనగా సమాజంలో అందరికీ జీవితకాల అభ్యాసంపై అవగాహన పథకం ఇది. తద్వారా ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రము, జీవన నైపుణ్యము, అక్షరాస్యతను పెంచడం మరియు సమాజంలో ప్రతి ఒక్కరూ వారి పేర్లు రాయడం వారి సంతకాలు నేర్చుకోవడం లక్ష్యంగా, మండలంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో ఉల్లాస్ విద్యా విధానం మండలంలో ప్రతి పంచాయతీలో పొదుపు వివో ఏలను ఉల్లాస్ విద్య వాలంటీర్లుగా నియమించి నిరక్షరాస్యులకు గత రోజుల నుండి చదువు నేర్పిస్తున్నారు. ఈరోజు తిరుపతి జిల్లా నుంచి అన్ని మండలాల్లోని ఉల్లాస్ విద్య కేంద్రాలకు ప్రశ్న పత్రాలను పంపిణీ చేసి జిల్లా వ్యాప్తంగా పరీక్షలు నిర్వహించారు. బాలాయపల్లి ఎంపీడీవో సమక్షంలో మండలంలో ఉల్లాస్ విద్యా కేంద్రాలలో పరీక్షలను నిర్వహించారు. నిండలి గ్రామంలో ఉల్లాస్ విద్య వాలంటరీ అయిన కొండూరు వసంతమ్మ ఉల్లాస్ విద్య కేంద్రంలో పరీక్షను నిర్వహించారు.

## కౌన్సిలర్లు పార్టీకి కట్టుబడి ఉండాలి : నేదురుమల్లి



వెంకటగిరి, మార్చ్ 23 ప్రభాతవార్త: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కౌన్సిలర్లు అందరూ కట్టుబడి ఉండాలని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు రాంకుమార్‌రెడ్డి పల అంశాలపై చర్చించారు. చైర్‌పర్సన్ నక్క భానుప్రియపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని 16 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, 15 వార్డ్ కౌన్సిలర్ దొంతు శారద నేతృత్వంలో కౌన్సిలర్లు కలెక్టర్ కలిసి అవిశ్వాసంపై వినతి పత్రం అందజేశారు. అయితే కౌన్సిలర్లు అందరూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని ఆయన వారికి ప్రత్యేకంగా సూచించారు. కౌన్సిలర్లను విడివిడిగా పిలిచి చర్చించారు. చైర్ పర్సన్ నక్క భానుప్రియ, కౌన్సిలర్లు ఎంఎ నారాయణ, పూజారి లక్ష్మి, వహీదా, విజయలక్ష్మి, మల్లీశ్వరి, సుబ్బారావు, గోపాల కృష్ణ, శ్రీనివాసులు, సుభావళి, మండల పార్టీ కన్వీనర్లు ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసు లురెడ్డి, నాయకులు హరికృష్ణ, దశరథరామ్‌రెడ్డి, సతీషు, సిపిఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## మెగా అభిమానులచే రక్తదానం

సూళ్లూరుపేట, మార్చి 23 ప్రభాతవార్త: ప్రముఖ సినీనటుడు రామ్‌చరణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానికంగా ఉన్న చిరంజీవి సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం మెగా స్వచ్ఛంధ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో వందమంది దాతలు రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మాబాషా, హేమంత్‌కుమార్ శర్మ, కోటి, తేజ, రమణ, దాస్, భాను, సాయిశివా, శ్రీమంత్, విజయమ్మ, సుజన్, చంద్రమోహన్, రాజారెడ్డి, సూరిబాబులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరం



గూడూరు, మార్చి 23 ప్రభాతవార: రక్తదానం ప్రాణదానంతో సమానమని జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు అన్నారు. ఈ నెల 27న గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ గారి జన్మదినం సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత పిలుపు మేరకు మెగా బ్రదర్స్ సేవాసమితి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో గూడూరు జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల ప్రమాదాల్లో గాయపడ్డ వారిని, అత్యవసర సమయాల్లో క్షతగాత్రుల ప్రాణాలను కాపాడ గలిగిన వారిమవుతామని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత కలిగి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.మోహన్, సాయి, రాకేష్, ఓంకార్, ఇమ్రాన్, సనత్, షఫీ, నవీన్, ముత్యాలు, భాస్కర్, కార్తిక్, రవి, మహేష్, సునీల్, గురు, అను, చరణ్, మధు, శివాజీ, తిరుపాలు, మహేష్, మనోజ్, మస్తాన్, శ్రీను, వినయ్, శంకర్ మెగా ఫ్యామిలీ అభిమానులు మరియు జనసైనికులు పాల్గొన్నారు.

## సంపన్న భారతదేశం నినాదంతో... సిఐఎస్‌ఎఫ్ దళాల సైక్లోథాన్ యాత్ర

**- నేడు షార్‌కు సమీపంలో తడ మండల జైన్ టెంపుల్‌లో సమావేశం - హాజరు కానున్న షార్ అధికారులు, సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది**



శ్రీహరికోట (తడ), మార్చి 23 ప్రభాతవార్త : సురక్షిత తీరం సంపన్న భారతదేశం అనే నినాదంతో కేంద్ర పారిశ్రామిక భద్రత దళాలు దేశ వ్యాప్తంగా సైక్లోథాన్-2025 కార్యక్రమం చేపట్టాయి. ఈ స్మారక యాత్ర 9 రాష్ట్రాల్లో 6,553 కిలోమీటర్ల దూరం కొనసాగి ఏప్రిల్ 1వ తేదీ తమిళనాడులోని కన్యాకుమారిలో ముగుస్తుంది. ఈ నెల 7న కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా ఈ యాత్రను ప్రారంభించారు. తీరప్రాంత ప్రజలతో నిమగ్నవడం కాకుండా భద్రతపై అవగాహన కల్పిస్తూ ఈ యాత్ర జరుగుతోంది. ఏపీలో చీరాల నుంచి తడ వరకు జరిగే కార్యక్రమాన్ని శ్రీహరికోటలోని సిఐఎస్‌ఎఫ్ ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 8 గంటలకు తడ మండలం అక్కంపేట వద్దనున్న జైన్ టెంపుల్‌లో మెగా ఫంక్షన్ ఏర్పాటు చేశారు. షార్ డైరెక్టర్ రాజరాజన్, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డితో పాటు సిఐఎస్‌ఎఫ్ ఐజి ఆర్.శరవణన్, డిఐజి అపరాజిత మహాపాత్ర, సీనియర్ కమాండెంట్లు సంగీత్ కుమార్, కార్తికేయన్, డిప్యూటీ కమాండెంట్ నీలేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొంటారని సిఐఎస్‌ఎఫ్ అధికారులు ఆదివారం తెలిపారు. శ్రీహరికోట నుంచి అక్కడి అంతరిక్ష కేంద్రాన్ని కంటికి రెప్పలా కాపాడే సిఐఎస్‌ఎఫ్ దళాలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయి. సుమారు వంద మంది సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది తొమ్మిది రాష్ట్రాలను కలుపుతూ 25 రోజుల పాటు చేస్తున్న ఈ సైకిల్ యాత్రకు పలుచోట్ల విశేష ఆదరణ లభించిందని తెలిపారు.

## పేద ముస్లీంలకు రంజాన్ తోఫా పంపిణీ



గూడూరు, మార్చి 23 ప్రభాతవార్త: పట్టణంలోని షాదీ మంజిల్‌లో మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్ వర్క్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పేద ముస్లీంలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్ వర్క్ అసోసియేషన్ ప్రతినిధులు రహీమ్ మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని పేద ముస్లీంలందరూ ఘనంగా జరుపుకోవాలని ఈ సేవాకార్యమ్రాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఏడాది కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు మాభాషా, గౌరవాధ్యక్షుడు రియాజ్ అహ్మద్, ప్రతినిధులు రహీమ్, అప్సర, కరిముల్లా, గోల్డ్ నాజర్, లలితా మెడికల్ యూసఫ్ హుస్సేన్, బాబర్, రఫీ, అల్లీ హుస్సేన్, నాజర్, షఫీ మౌలానా, హరన్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## మూకుమ్మడి బదిలీలు చేసి నాపై నెట్టడమేంటి!

**-ఎమ్మెల్యే అమరనాథరెడ్డి**

పలమనేరు,మార్చి 23 ప్రభాతవార్త: వైకాపా అక్రమాలకు సహకరించిన అధికారులను బదిలీ చేయమంటు లేకుంటే టిడిపి కార్యకర్తలకు జరిగే అన్యా యాన్ని నియంత్రించ లేమని తెలిపిన నా వ్యాఖ్యలపై మూకుమ్మడి బదిలీలు జరిగిందని ఆరోపించడం సరికాదని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన నియోజకవర్గస్థాయి నాయ కుల సమావేశంలో కొందరు స్థానిక నాయకులు పూంగనూరు నియోజకవర్గంలో టిడిపి నాయకుడు రామక్రిష్ణ మృతికి వెళ్లి పోలీసులపై విమర్శలు చేయడం జరిగింది. సూమారు 240 మంది పోలీసులు బదిలీ కావడం జరిగిందని తెలపడంతో ఆయన స్పందిస్తూ గత ప్రభుత్వంలో అక్రమాలకు సహకరించిన వారిని నేటికి అదే ప్రాంతాలలో విధులు నిర్వహించడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన వారిని బదిలీ చేయమని సూచిస్తే మూకుమ్మడి బదిలీ నా వ్యాఖ్యలతో జరిగిందనడం సరికాదని, వారి బదిలీలతో తమకు వచ్చిన లాభం ఏమీ లేదని నాయకులకు వివరించారు.

## ఒకే ఈతలో మూడు దూడలు జననం



ఐరాల, మార్చా 23 ప్రభాతవార్త: ఒకే ఈతలో ఆవు మూడు దూడలు జన్మించిన సంఘటన మండలంలోని ఎదర్లపల్లెలో ఆదివారం జరిగింది. ఎదర్లపల్లెకు చెందిన పాడి రైతు వినోద్ అదే గ్రామానికి చెందిన పాడి రైతు వద్ద పాడి ఆవును కొనుగోలు చేశారు. ఈఆవు ఆదివారం మూడు దూడలకు జన్మనిచ్చింది. ఒకే సారి మూడు కోడె దూడలు జన్మించగా అందులో రెండు దూడలు మృతి చెందగా ఒక దూడ మాత్రం ఆరోగ్యంగా వున్నట్లు పాడి రైతు తెలిపారు. ఆవు రెండవ ఈతలో మూడు దూడలకు జన్మనిచ్చినట్లు తెలిపారు.

## నేటి నుండి రైల్వే గేటు బంద్

రేణిగుంట మార్చి 23 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి వద్ద రైల్వే ట్రాక్లను క్రాస్ దాటే రైల్వే గేటును మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే గేటు మరమ్మత్తులు దృష్ట్యా 24వ తేదీ సోమవారం, 28వ తేదీ శుక్రవారం సాయంత్రం వరకు గేటును మూసి వేస్తామని ప్రకటనలో పేర్కొన్నారు. మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు అంతరాయాన్ని గమనించి ప్రత్యామ్నాయ మార్గాలలో ప్రయాణించాల్సి న ఆవశ్యకత ఏర్పడింది.

## తెలుగుదేశం పార్టీకి భంగపాటు తప్పదు : నేదురుపల్లి

వెంకటగిరి, మార్చ్ 23 ప్రభాతవార్త : ఏప్రిల్ 9 తేదీన వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ నక్క భానుప్రియపై జరిగేఅవిశ్వాస తీర్మానంలో వైఎస్ఆర్సీపీ విజయం తథ్యం అని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త రామ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వెంకటగిరి లోని ఎంజెఆర్ భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో టిడిపి పెట్టే ప్రలోభాలు కేసులను దీటుగా ఎదుర్కొంటాం అని చెప్పారు. ఏప్రిల్ 9వ తేదీన వెంకటగిరి మున్సిపాలిటీలో జరిగే అవిశ్వాస తీర్మానంలో వైఎస్ఆర్సిపి విజయం తథ్యమని, టిడిపికి భంగపాటు తప్పదాన్ని తెలియజేశారు. మున్సిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లలో ఒక్క కౌన్సిలర్ కూడా లేని టిడిపి ఒకర్ని ఎన్నుకొని అవిశ్వాస తీర్మానం పెట్టి అధికార దుర్వినియోగం కు తెరలేపిందని విమర్శించారు. 25 మంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారేందని తెలిపారు. వైఎస్సార్సీపిపై పోటీకి దిగడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంను కోరుకుంటున్నామని ఆయన వెంట నడుస్తామని తనను కలిసిన 18 మంది కౌన్సిలర్లు ముక్తకంఠంతో స్పష్టం చేశారన్నారు.

## రికార్డు స్థాయిలో రాహుకేతు దోష నివారణ పూజలు

శ్రీకాళహస్తి,మార్చి 23 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తులు తాకిడి అధికమైంది. ఆలయాధికారులు అందించిన సమాచారం మేరకు సుమారు 25వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకోగా మహి మాన్వితమైన రాహుకేతుదోష నివారణ పూజలు రికార్డు స్థాయిలో జరిగాయి. ఆలయాధికారులు అందించిన సమాచారం మేరకు 4802 పూజలు జరిగినట్లు పేర్కొన్నారు. ఇందులో రూ.500ల పూజా టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు 2822 మంది పూజలు జరిపించుకున్నట్లు వివరించారు. ఇక దర్శనం టిక్కెట్లు కూడా 6521 మంది కొనుగోలు చేసి ప్రవేశించారు. దళారులను కట్టడి చేయటంతో రోజుకు రూ.50వేలు ఆదాయం పెరిగిందని ఇఒ డి.బాపిరెడ్డి వివరించారు. స్వామి అమ్మవార్ల అభిషేకాలు కూడా గణనీయంగా జరిగాయి.118 మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు 27 జరిగినట్లు వివరించారు.

## తిరుపతి జిల్లాకు చేరుకున్న సైక్లిస్టులు



తిరుపతి కలెక్టరేట్, మార్చి 23 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాకు చేరుకున్న సైక్లిస్టులకు ఘన స్వాగతం లభించింది. ఆదివారం సాయంత్రం సీఐఎస్ఎఫ్ కోస్టల్ సైక్లోథాన్ కావలి (నెల్లూరు జిల్లా) నుంచి 1800 నాయుడు పేట వాసమ్మ ఆశ్రమం (తిరుపతి జిల్లా)కి చేరుకుంది. సైక్లిస్టులకు స్థానిక ప్రముఖులు, పాఠశాల పిల్లలు, స్థానిక ప్రజలు పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. సైక్లోథాన్ ఇప్పటికే బక్కలి (పశ్చిమ బెంగాల్) నుంచి నాయుడుపేట (ఆంధ్రప్రదేశ్) వరకు 1877 కి.మీ సవాలుతో కూడిన ప్రయాణాన్ని పూర్తి చేసింది. ఇది ఇప్పటి వరకు భారత దేశ విస్తారమైన తీరప్రాంతాన్ని కవర్ చేసిన అద్భుతమైన యాత్ర ఈ కార్యక్రమానికి కార్తికేయన్ సీనియర్ కమాండెంట్ సీఐఎస్ఎఫ్ చెన్నై పోర్టు అథారిటీ డెప్యూటీ కమాండెంట్ వినీత్ కుమార్, ప్రభాకర్, డి. చెంచుబాబు, డెప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నాయుడుపేట, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం. బాబీ, నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్ సంగమేశ్వర్‌రావు, రూరల్ ఇన్‌స్పెక్టర్ నాయుడుపేట, అజయ్ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ దొరవారి సత్రం పోలీస్‌స్టేషన్ కార్యక్రమం నిర్వహణలో పాల్గొన్నారు. దేశ నిర్మాణంలో సీఐఎస్ఎఫ్ అందిస్తున్న సేవలు, కీలక పాత్రకు సభాసదులు అభినందనలు తెలిపారు. జాతీయ భద్రత, సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంలో సైక్లోథాన్ యొక్క ప్రాముఖ్యతను వారి ఉనికి హైలైట్ చేసింది. సాయంత్రం, ప్రముఖ సభను ఉద్దేశించి సాయంత్రం ప్రముఖులు సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ గొప్ప కార్యక్రమానికి నాయకత్వం వహించినందుకు సీఐఎస్ఎఫ్‌ను ప్రశంసించారు. పౌరులలో తీర ప్రాంత భద్రతా అవగాహనను పెంచడంలో దాని పాత్ర నొక్కి చెప్పారు.

## ఆయకట్టు ఎన్నికల్లో తిరకాసు

పాలసముద్రం, మార్చి 23 ప్రభాతవార్త: పాలసముద్రం నీటి ఆయకట్టు సంఘాల ఎన్నికల్లో తిరకాసు చోటు చేసుకుంది. నీటి ఆయకట్ట సంఘ ఎన్నికల్లో పోటీ చేసిన రైతులు పెండింగ్‌లో వున్న పన్నులను చెల్లించి ఎన్నికల్లో పోటీ చేశారు. నిబంధనల మేరకు ఈ పన్నుల చెల్లింపు మొత్తం ఆన్‌లైన్‌లో జరగాల్సి వుండగా నాలుగు నెలల క్రితం జరిగిన ఎన్నికల సమయంలో అధికారులు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుండి పన్ను మొత్తం తీసుకొని వారికి రసీదులు జారీ చేశారు. ఇలా వసూలు చేసిన మొత్తం ఎక్కడికి వెళ్ళిందనే ప్రశ్నలు ప్రస్తుతం రైతుల నుండి వస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల నుండి పన్నుల రూపంలో వసూలు చేసిన మొత్తంను పంచాయతీ ఖాతాలు జమ చేయాలి! లేదా ట్రెజరీ ఖాతాకు జమ చేయాలి! లేదా ఏదేని ప్రభుత్వ శాఖ ఖాతాకు జమ చేయాలి! అయితే ఈ మొత్తం ఏ ఒక్క ఖాతాకు జమ కాకపోవడంతో ఎన్నికల్లో పోటీ చేసిన వారి నుండి వసూలు చేసిన పన్నుల మొత్తం డబ్బులు ఎక్కడికి వెళ్ళాయి! అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై తహసిల్దారు విచారించి చర్యలు తీసుకోవాలని లేకుంటే జిల్లా అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి కేంద్రీకరించాలని రైతులు కోరుతున్నారు.

## నాయిబ్రాహ్మణ వర్గాల్లో ఆధిపత్యపోరు

తిరుపతికలెక్టరేట్,మార్చి 23ప్రభాతవార్త: పీస్‌రేట్ ఉద్యోగాల కల్పన పేరుతో నాయిబ్రాహ్మణ వర్గాల్లో ఆదిపత్యపోరు నెలకొన్నట్లు తెలుస్తోంది. ఓ వర్గం మరో వర్గంపై దాడికి పాల్పడిందని, ఇందులో వాస్తవం ఏమిటనేది పరస్పరం నాయీ బ్రాహ్మణులు చర్చించుకుంటున్నారు. తిరుపతిలోని భవానీనగర్‌లో రెండు రోజుల క్రిందట దాడులకు దిగడంతో వివాదం రోడ్డుపైకి చేరింది. రాజకీయపార్టీలకు అనుబంధంగా కెకెసిలో శ్రీహరి, బుజ్జిబాబు ఇద్దరు వ్యవహరిస్తున్నారు. కల్యాణ కట్టలో 150 మంది శ్రీవారి సేవ పేరుతో కొందరిని చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు రగడకు కారణంగా మారిందనేది చర్చ. ఆదివారం రాత్రి వరకు ఈస్టు పోలీసులకు ఈ ఘటనపై ఎలాంటి షిర్యాదు అందలేదనేది పోలీసువర్గాల సమాచారం.

## బ్రాహ్మణులకు ఎన్‌డిఏ పాలనలో ఆదరణ



**ట్రస్ట్ బోర్డులలో అవకాశాలు కల్పిస్తాం..!**

చంద్రగిరి, మార్చి 23 ప్రభాతవార్త: ఎన్‌డిఏ కూటమి పాలనలో బ్రాహ్మణులకు అన్నివిధాలుగా ఆదరణ వుంటుందని తిరుపతి ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు అన్నారు. శ్రీనివాస మంగాపురంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం తిరుపతి జిల్లా బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సేవా సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేవాలయాల పాలక మండళ్ళలో అర్చకుడితో పాటు బ్రాహ్మణుడిని నియమిస్తా మన్నారు. కపిలతీర్థం వద్ద అపకర్మలు నిర్వహించడంలో తలెత్తే ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకురాగా టిటిడి, అటవీశాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. అపకర్మల నిర్వహణకు శాశ్వత భవన నిర్మాణానికి సహకరిస్తానన్నారు. యువగళంలో నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు వేద విద్యను అభ్యశించిన బ్రాహ్మణ నిరుద్యోగులకు రూ.3 వేలు భృతిని ప్రభుత్వం అందిస్తుందన్నారు. అదేవిధంగా టిటిడి బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ భగవంతుడికి, భక్తుడికి మధ్య వారధి వంటి వారు అర్చకులన్నారు. దూపదీప నైవేద్యాలకు నోచుకోలేని ఆలయాల కోసం టిటిడి ప్రత్యేక నిధిని చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఏతో కలసి నూతన పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపి బ్రాహ్మణ, అర్చక, పురోహిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్వాశుల రామస్వామి, ప్రధాన కార్యదర్శి ములుగు కిరణ్ కుమార్, మల్లెల రంగనాథ శర్మ, శీను స్వామి, కాకుమాను సిద్ధాంతి, కోడూరు గౌతమ్ శర్మ, ఆలూరు సాయి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



సూళ్లూరుపేట, మార్చి 23 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న ఉగాది వేడుకలకు హాజరు కావాలని దేవస్థానం సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి ఆదివారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యదర్శి ఎజి కిషోర్, బొమ్మన్ పళణి, చెన్నెం శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, విశ్వమూర్తి తది తరులు పాల్గొన్నారు. అలాగే దావాదిగుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరు కావాలని ఆ గ్రామస్తులు ఎమ్మెల్యేని కలిసి ఆహ్వానించారు.

## మండల బిజెపి అధ్యక్షుడు రాజీనామా!

కోట, మార్చి 23 ప్రభాతవార్త : కోట మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ వాసు ఆ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు చెప్పారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించి మూడున్నర నెలల కాలంలో తనకు మండలంలోని నాయకులెవరూ సహకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తాను జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులుకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన కూడా ఏమాత్రం సహకరించలేదన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

బిజెపి రథసారధి ఎవరు:

ప్రస్తుతం కోట మండల బిజెపి అధ్యక్షుడు వాసును పార్టీ సిద్ధాంతం మేరకు తొలగించారని, ఆయన స్థానంలో నూతన అధ్యక్షుడిని నియమించేందుకు ఆ పార్టీ కసరత్తు చేస్తోంది. వాసుకు వయసు రీత్యా అధ్యక్ష పదవికి అర్హులు కాదని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. యువకులకు పార్టీ అధ్యక్ష పదవి ఇచ్చేందుకు అన్వేషిస్తున్నారు. మరో వారంరోజుల్లో కోట మండల బిజెపి అధ్యక్షుడిని నియమిస్తామని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు తెలిపారు.

## అతివలకు ఉల్లాస్ పరీక్ష



కోట, మార్చి 23 ప్రభాతవార్త: నిరక్షరాస్యులుగా ఉన్న మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉల్లాస్ కార్యక్రమం అములు చేసింది. (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటి) కార్యక్రమం ద్వారా ఆర్థిక సామాజిక డిజటల్ అక్షరాస్యతపై మహిళలకు తరగతులను నిర్వహించారు.నవంబరులో ప్రారంభించిన కార్యక్రమంలో విద్యా వాలంటీర్లుగా నియమించి ఆయా గ్రామాల్లో 100 రోజుల పాటు 304 మంది డ్వాక్రా మహిళకు విద్యా బోధన చేశారు. నిరక్షరాసులుగా ఉన్న మహిళలను గుర్తించి వీరికి పాఠాలు బోధించారు. తరగతులను నిర్వహించారు. ఆదివారం కోట మండలంలోని 30అంగన్‌వాడీ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిం చారు. ఈ పరీక్షలను ఎపిఎం అనిల్‌తో పాటు, సిసిలు భాస్కర్, ప్రసాద్, శ్రీకాంత్,అవిలేమ్మలు పర్యేవేక్షించారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుడు రావూరు



గూడూరు, మార్చి 23 ప్రభాతవార్త: పట్టణం గాంధీనగర్ ప్రాంతానికి చెందిన రావూరు సురేంద్ర గూడూరు డివిజనల్ లెవెల్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. ఎమ్మెల్యే సునీల్ కుమార్ సిఫార్సు మేరకు ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రావూరు సురేంద్ర మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా రెండోసారి అవకాశం కల్పించిన మా ప్రియతమ నాయకులు పేద ప్రజల ఆశా కిరణం గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు పాశం సునీల్‌కుమార్‌కి ధన్యవాదాలు తెలిపారు. తనకు ఈ పదవి రావడంతో మరింత బాధ్యత పెరిగిందని ఎస్సి, ఎస్టిల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ఐదు చలివేంద్రాలు ఏర్పాటు




సూళ్లూరుపేట, మార్చి 23 ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధిలో వేసవి కాలాన్ని పురస్కరించుకొని ప్రజల దాహార్తి తీర్చడానికి ఐదుచోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ చలివేంద్రాలను లాంఛనంగా ప్రారంభించారు. సింటెక్ ట్యాంకులను పెట్టి అందులో నిత్యం నీరు అందుబాటులో ఉండేలా సిద్ధం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ చిన్నయ్య మాట్లాడుతూఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సూచనలతో పట్టణంలోని హోలీక్రాస్ జంక్షన్, షార్ వై జంక్షన్, వినాయకగుడి సెంటర్, ఆర్టీసీ బస్టాండు, చెంగాళమ్మగుడి వద్ద ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

## జాతర భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

కోట, మార్చి 23 ప్రభాతవార్త: చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో ఈ నెల 25 నుంచి జరగనున్న ముత్యాలమ్మ జాతరకు వెళ్లే భక్తులకు పోలీసులు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు అంబరీష్ కోరారు. ఆయన ఆదివారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ కోటలో రోడ్డు నిర్మాణం జరుగుతున్నందున దూరప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చే వారికి ఈ సమస్య తెలియదన్నారు. దీంతో వారు నేరుగా కోట మీదుగా కనుపూరుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తారని తెలిపారు. వాహనదారులకు పోలీసులు ముందస్తు సూచనలు, సలహాలు చేయాలని కోరారు. ఎక్కడ ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారో ఆ ప్రాంతంలో రాకపోకల గురించి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే క్రమంలో ఎండ తీవ్రత ఉన్న దృష్ట్యా కోట పంచాయతీ అధికారులు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

## 28న ఛలో ఢిల్లీకి తరలిరండి



తడ, మార్చి 23 ప్రభాతవార్త: భవన మరియు నిర్మాణరంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆలిండియా భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటియుసి ఆధ్వర్యంలో ఈ నెల 28న ఢిల్లీలో జరుగుతున్న ఆందోళన కార్యక్రమానికి హాజరు కావాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు పిలుపు నిచ్చారు. ఆదివారం తడలో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి నాగేంద్రబాబు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కె.రవి, శ్రీనివాసులు, శివకుమార్, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తిగా యువత ఉద్యమించాలి



తడ, మార్చి 23 ప్రభాతవార్త: భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు యువత ఉద్యమించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్ రాజ్ సుకదేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా తడలో ఆదివారం షహీద్ దివస్‌ను జరుపుకున్నారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, పలువురు సిపిఐ, ఏఐటియుసి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలయ్యను పరామర్శించిన వైసీపీ నాయకులు



వెంకటగిరి, మార్చి 23 ప్రభాతవార్త : అనారోగ్యంతో బాధపడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ చేతురాశి బాలయ్యను వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, వైసీపీ నాయకులు పరామర్శించారు. బాలయ్య ఆరోగ్య విషయమై అడిగి తెలుసుకున్నారు. వైసిపి నాయకుడు కందాటి రాజారెడ్డిని కూడా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట వాటి కన్వీనర్లు ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నాయకులు హరికృష్ణ, సతీష్, మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

## పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం




వాకాడు, మార్చి 23 ప్రభాతవార్త: వాకాడులో ఎస్ఎల్ సి ఈఎఫ్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1999-2004 సంవత్సరం మధ్యలో 10తరగతి చదివినా వివిధ ప్రాంతలలో, వివిధ రంగాలలో రానిస్తూ వారిదైనా శైలిలో ఆనాటి మరుపురాని గుర్తులును నెమరు వేసుకున్నారు. సమావేశంలో ఆ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు పేరుపేరునా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాని, ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల సంతోషం వ్యక్తపరిచారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ కలిసి పాఠశాలకు బహుమతి అందజేసి ప్రతి ఉపాధ్యాయులకు శాలువా కప్పి పూలమాలలు వేసి విద్యార్థులు ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.